క్లుప్తంగా

మట్టి నమూనాలు సేకరించాలి



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: ఆర్బీకేల సిబ్బంది ఆయా గ్రామాల్లో కనీసం 50 మంది రైతులకు సంబంధించిన పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించాలని ఏడీఏ ఆంజనేయ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు విషయాలను ప్రస్తావించారు. ప్రధానంగా సోయాబీన్ కేడీఎస్ 726 రకం విత్తనాలు, మొక్కజొన్న హై బ్రీడ్ విత్తనాలు రాయితీలో రైతులకు అందించాలని కోరారు. పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వ్యక్తిగతంగా ట్రాక్టర్ ఉన్న రైతులకు వ్యవసాయ యంత్ర సామగ్రి ఇవ్వాలని, రైతులకు టార్పాలిన్‌పట్టలు, స్ప్రేయర్లు, పీవీసీ పైపులు రాయితీలో అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏఓ ఫణీశ్వరరెడ్డి,సలహా మండలి మండల అధ్యక్షుడు రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు భీమశేఖర్,అంబయ్య, ఏఈఓ మద్దిలేటి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

మహానంది: మండలంలోని సీతారామాపురం గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని తెలిపారు. శుక్రవారం ఆమె మట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమం మధ్యాహ్నం 3గంటల నుంచి మొదలవుతుందని చెప్పారు.

మహానందిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న కర్ణాటక న్యాయమూర్తి

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.రామచంద్ర హంద్దార్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి స్వాగతం పలికారు. వారు శ్రీకామేశ్వరీదేవి,మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

రిటైర్డ్ డీజీపీ పూజలు..

మహానందీశ్వరస్వామి సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ డీజీపీ మహేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. క్షేత్రంలో శుక్రవారం జరిగిన ఓ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి,అమ్మవార్ల ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ రవీంద్ర ఆయన వెంట ఉన్నారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డిలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

సబ్సిడీ విత్తనాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు సబ్సిడీపై విత్తనాలు మంజూరు చేయాలని జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాజమోహన్ రెడ్డి కోరారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహామండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొక్కజొన్న విత్తనాలు, జింకు, జిప్సంను 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలన్నారు. ఏడీఏ ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్బీకేల్లో రసాయనిక ఎరువులు, జీలుగ, పిల్లి పెసర, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పశుసంవర్ధక శాఖ అధికారి శివసాగర్‌రెడ్డి, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి అరుణ పాల్గొన్నారు.

మాటలతో మాయ చేయడంలో చంద్రబాబు నాయుడుని మించిన వారు లేరని రాజకీయవర్గాల్లో ప్రచారం ఉంది. అయితే శ్రీశైలం నియోజకవర్గంలో అది నిజమైంది. ఎంతలా అంటే ఇచ్చిన హామీలు కనీసం తన ఐదేళ్ల పాలనలో గుర్తుకు రాకపోయేంతలా. సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా యథాలాపంగా హామీల చిట్టా విప్పారు. నోటికొచ్చినంత చెప్పేశారు. అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటూ ప్రగల్భాలు పలికారు. తీరా..అక్కడి నుంచి కారెక్కగానే వాటిని మర్చిపోయారు. ఇచ్చిన హామీలు నల్లమల అడవుల్లో కలిసిపోయాయి.





తెలుగుగంగ ఆకట్టకు లైనింగ్ పనులు జరుగుతున్న దృశ్యాలు

నాడు మాటలతో సరిపెట్టారు!

- సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు గాలికి
- ఎన్‌హెచ్–352 నిర్మిస్తామని చెప్పి.. సర్వే కూడా చేపట్టని వైనం
- శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని బాబు
- నేడు.. అభివృద్ధి పథంలో పరుగు
- ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల నిర్మాణాలతో గ్రామాలకు నూతన శోభ
- పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నూతన రోడ్లు
- రూ.280 కోట్లతో తెలుగుగంగ ప్రధాన కాల్వ లైనింగ్ పనులు
- శ్రీశైలం, మహానంది క్షేత్రాల్లో జోరుగా అభివృద్ధి కార్యక్రమాలు

ఆత్మకూరు: 2018 జనవరి 9న సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభించేందుకు నాటి సీఎం చంద్రబాబు నాయుడు వచ్చారు. ముఖ్యమంత్రి స్థాయిలో నాడు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. అయితే అవేవీ నెరవేర్చలేదు. కేవలం హామీలుగానే మిగిలిపోయాయి. డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తాం, రైతన్నలకు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఇంటింటికీ ఓ ఉద్యోగం లాంటి ఎన్నో హామీలు గుప్పించారు. అయితే ఒక్కటి కూడా చేసి చూపలేక పోయారు. అలాగే..సిద్ధాపురం చెరువు కింద రైతులకు పంట కాల్వలు , గ్రామంలో రహదారులు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పినా చేయలేదు. కర్నూలు– గుంటూరు ఎన్‌హెచ్ 352 రహదారి ఏర్పాటు చేస్తామని చెప్పారు. తాను గద్దె దిగే నాటికి కూడా కనీసం సర్వే కూడా చేపట్టలేదంటే ఆయన ఏ మేరకు మాట నిలబెట్టుకుంటారో అర్థం చేసుకోవచ్చు. నాటి హామీలపై పాదయాత్ర పేరుతో వస్తున్న చినబాబు లోకేష్ ఏమి చెబుతారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



ఆత్మకూరులో డా.వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్

కొండెక్కిన చంద్రబాబు హామీలు..

- సిద్ధాపురం ఎత్తిపోతల పథకం పనుల సమయంలో చెరువుకు పంట కాల్వలు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చినా..నెరవేర్చలేదు.
- సిద్ధాపురం గ్రామాభివృద్ధికి రహదారులు, సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులు చేస్తామని చెప్పినా.. ఒక్కటీ చేయలేదు.
- ఎన్‌హెచ్–352 హైవే కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి ఏర్పాటు చేస్తామన్నారు.. మీ పాలనలోని 5 ఏళ్లలో కనీసం సర్వేకు కూడా నోచుకోలేదు.

నేడు అభివృద్ధి పథంలో నియోజకవర్గం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శ్రీశైలం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి.

మండలాల వారీగా అభివృద్ధి..

ఆత్మకూరు..

- ఆత్మకూరు పట్టణంలో అమృత్ పథకం కింద రక్షిత మంచినీటి సౌకర్యం కోసం రూ.116 కోట్లతో వివిధ చోట్ల మంచినీటి ట్యాంకుల ఏర్పాటు
- రూ.5 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు పూర్తి
- పట్టణంలో రూ. 3 కోట్లతో మరిన్ని సీసీ రోడ్లు, మండలంలో రూ. 6 కోట్లతో నూతన సచివాలయాల ఏర్పాటు. రూ.2.31 కోట్లతో 11 రైతు భరోసా కేంద్రాలు, రూ.1.60 కోట్లతో 11 హెల్త్ సెంటర్ల నిర్మాణం.
- పట్టణంలో జగనన్న కాలనీల్లో 3,212 పక్కాగృహాలకు రూ.57,81,60,000, మండలంలోని వివిధ గ్రామాల్లో 1,480 జగనన్న పక్కా గృహాలకు రూ.26,46,00,000, రూ. కోటితో ప్రభుత్వ వైద్యశాల ఆధునికీకరణ .

శ్రీశైలం..

శ్రీశైల దేవస్థానం పరిధిలోని భూములను గుర్తించి దేవస్థానానికి అప్పగింత.

- శ్రీశైలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వడ్డెర కాలనీలతో పాటు శ్రీగిరి కాలనీ, కొత్తపేటకు సీసీరోడ్లు,
- సున్నిపెంట గ్రామ పంచాయతీగా ఏర్పాటు
- సున్నిపెంటలో శాశ్వత మంచినీటి పరిష్కారం కోసం రూ.7 కోట్లతో పనులు, రూ.5కోట్లతో సీసీ రోడ్ల ఏర్పాటు.

బండిఆత్మకూరు మండలం..

- తెలుగు గంగ ప్రధాన కాల్వ లైనింగ్ పనులు రూ.280 కోట్లు,
- పేదలకు 413 గృహాలకు రూ.7.50 కోట్లు, లింగాపురం గ్రామంలో గ్రావెల్‌రోడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు

నేడు.. అభివృద్ధి పరుగులు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది మొదలు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేపడుతూ నియోజవర్గాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో తీర్చిదిద్దుతున్నారు. గ్రామాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు, ఆసుపత్రులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రంథాలయాలు, వివిధ గ్రామాలను కలిపేందుకు బీటీ రోడ్లు ఏర్పాటు చేశారు.దీంతో పల్లెలు కొత్త రూపు సంతరించుకున్నాయి. అలాగే.. పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మించి ఇస్తుండటంతో కొత్త ఊర్లే వెలుస్తున్నాయి. ఆయా మండలాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇక మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జల జీవన్ మిషన్ కింద రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. ఇక శ్రీశైలం, మహానంది క్షేత్రాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. దీంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది.

- మండలంలోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డెయిరీలు, లైబ్రరీల నిర్మాణాలకు రూ.16 కోట్లు మంజూరు
- పార్నపల్లె, ఎర్రగుంట్ల గ్రామాల బీటీ రోడ్డుకు రూ.2.86 కోట్లతో పనులు
- ఈర్నపాడు గ్రామంలో రూ.13 లక్షలు, కడుమకాల్వ రూ.25లక్షలు, పెద్దదేవులాపురంలో రూ.18 లక్షలు, బి.కోడూరులో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.

మహానంది మండలం..

- రూ.4.41 కోట్లతో 11 సచివాలయాల నిర్మాణం
- రూ.2.20 కోట్లతో 10 రైతు భరోసా కేంద్రాలు, రూ.1.40 కోట్లతో 7 విలేజ్‌హెల్త్ క్లినిక్స్ నిర్మాణం.
- తమ్మడపల్లి నుంచి నందిపల్లెకు రూ.50 లక్షలతో బీటీ రోడ్డు
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో మహానంది ఆలయాభివృద్ధి

టీడీపీ నేతల మధ్య విభేదాలు



ఘర్షణ పడుతున్న బుడ్డా, అహ్మద్ హుసేన్ వర్గీయులు

ఆత్మకూరు: పట్టణంలో నారాలోకేష్ పాదయాత్ర ప్రారంభానికి ముందే తెలుగు తమ్ముళ్ల మధ్య వర్గ విభేదాలు పొడచూపాయి. శనివారం నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభం కానుంది. శుక్రవారం రాత్రి నందికొట్కూరు నియోజకవర్గం నుంచి శ్రీశైలం నియోజకవర్గంలోని కరివేన గ్రామానికి చేరుకున్నారు. పాదయాత్ర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి ఏరాసుప్రతాపరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అహ్మద్‌హుసేన్ మధ్య ఉన్న వర్గ విభేదాలు బయటపడ్డాయి. అహ్మద్ హుసేన్, ఏరాసు ప్రతాపరెడ్డి బ్యానర్లను బుడ్డా వర్గీయులు తొలగించారు. ఈ నేపథ్యంలో బుడ్డా అనుచరులు, అహ్మద్ హుసేన్‌కుమారుడు ముస్తఫా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘర్షణకు దిగారు. అహ్మద్‌హుసేన్ అనుచరులు ఏరాసు బ్యానర్‌లు ఆటోలకు కట్టి ప్రచారం చేయడం, భారీ బ్యానర్‌లు ఏర్పాటు చేయడాన్ని బుడ్డా వర్గీయులు జీర్ణించుకోలేకపోయారు. దీంతో బుడ్డా వర్గీయులు మాజీ మంత్రి ఏరాసు ఫొటో ఉన్న బ్యానర్లను తొలగించారు. రెండు వర్గాలకు చెందిన తమ్ముళ్లు తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగడంతో పోలీసులు జోక్యం చేసుకొని వివాదాన్ని సద్దుమనిగేలా చేశారు.

ఫొటో యాప్ రద్దు చేయాలి

నందికొట్కూరు: ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫొటో యాప్‌ను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పకీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బిజినవేముల గ్రామంలో ఉపాధి కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు అనేక కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. ఉపాధి కూలీల హాజరు శాతం కోసం ఫొటో యాప్ అమలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే ఉపాధి నిధుల్లో 30 శాతం వరకు కోత విధించిందని మండిపడ్డారు. సంఘం నాయకులు నరేష్, నాగేశ్వరరావు, నాగశేఖర్‌గౌడ్, సత్యం, శాంత కుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గిరిజనుల అభివృద్ధి

మహానంది: గిరిజనుల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. మహానంది గోశాలలోనున్న 14 జతల గోవులు, కోడెదూడలను గిరిజనులకు శుక్రవారం పంపిణీ చేశారు. మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల అభివద్ధి కోసం శ్రీశైలంలో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ చలం చలం శిరీష, మాజీ సర్పంచ్ అవుతు జయసింహారెడ్డి, నాయకులు భూమా సుబ్బరామయ్య పాల్గొన్నారు.



డిప్ సిస్టం ద్వారా గోవులను కేటాయిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఘనంగా సామూహిక వివాహాలు

మిడుతూరు: మండలంలోని రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామి సన్నిధిలోని కల్యాణ మండపంలో ఆరు జంటలకు సామూహిక వివాహాలు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపం చైర్మన్ పొలగ్గారి నాగిరెడ్డి మాట్లాడుతూ ఆలయ, కల్యాణ మండపం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన వధువరులకు తాళిబొట్లు, కాలి మెట్టెలు, నూతన పట్టు వస్త్రాలు, బహూకరించడంతోపాటు వివాహ వేడుకలకు హాజరైన వారి బంధుమిత్రులకు వివాహ భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిడుతూరుకు చెందిన రాము, కృష్ణవేణి, చిన్న సురేష్, కవిత, తలముడిపి గ్రామానికి చెందిన పెద్ద స్వాములు, సురేఖ, శ్రీనివాసులు, శ్రావణి, పారుమంచాల గ్రామానికి చెందిన మహేష్ , మేఘన, సుంకేసుల గ్రామానికి చెందిన బోయ మధు, శివాంజలికి వివాహం జరిపించినట్లు వివరించారు.



సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉద్యోగ భద్రత కల్పించాలి

శ్రీశైలం ప్రాజెక్టు: శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కన్సాలిడేటెడ్,కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు డి.నాగరాజు కోరారు. శుక్రవారం సున్నిపెంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు ఉద్యోగుల హక్కుల, ఉద్యోగ భద్రతకు ముప్పు కల్పించేలా అంగీకార పత్రాన్ని తీసుకొచ్చారన్నారు. అటవీ అభివృద్ధి మెంబర్ సెక్రటరీ పేరున తీసుకొచ్చిన అంగీకార పత్రాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు టి.సాల్మన్ పాల్గొన్నారు.

నర్సుల సేవలు మరవలేనివి

నందికొట్కూరు: ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో పని చేసే నర్సుల సేవలు మరవలేనివని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి అన్నా రు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి కరోనా రోగులకు వైద్య చికిత్సలు అందించారని కొనియాడారు. నాయకులు మహానంది, వీరేంద్ర, రాముడు, రాకేష్, మున్న, శంకర్ పాల్గొన్నారు.



నర్సులకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ప్రజాప్రతినిధుల్లో 14 గ్రామ పంచాయతీలకుగాను కేవలం నలుగురు సర్పంచులు, 13 ఎంపీటీసీ సభ్యుల్లో 8 మంది మాత్రమే హాజరయ్యారు. వచ్చిన అర కొర ప్రజా ప్రతినిధులు కూడా సమస్యల ఊసెత్తకపోవడం గమనార్హం. మండలంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అధిక శాతం కర్నూలు నుంచి వస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద రెండేళ్ల క్రితం నుంచి రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతున్నప్పటికీ ఏర్పాటు చేయలేదని ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యర్రగూడూరు టికెట్ తీసుకున్నప్పటికీ బస్సు ఆపడం లేదన్నారు. కేవలం ఆత్మకూరు డిపోకు చెందిన బస్సులే ఆపడం లేదని సభ దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై డిపో ఉన్నతాధికారులతో మాట్లాడతామని ఆర్టీసీ ఉద్యోగి సమాధానమిచ్చారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఏఓ కరుణ సాగర్, డాక్టర్ లావణ్య, పశువైద్యాధికారి భాస్కర్, ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఏఈలు రాఘవేంద్రప్రసాద్, శివరామకృష్ణారెడ్డి, జుబేర్, సెరికల్చర్ ఆఫీసర్ వరప్రసాద్, ఏపీఎం అనురాధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

మహానంది: సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభు త్వ సంక్షేమ పథకాలు వివరించి క్యాలెండర్‌ను పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీలతో పాటు అగ్రవర్ణ మహిళలకు పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలకు అన్నిరకాలుగా మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, యర్రగుంట్ల సర్పంచ్ కె.శ్వేతకుమారి, న్యాయవాది సుబ్బరాయుడు, పరమటూరు సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లయ్య, ఎంపీటీసీ మైఖేల్‌బాబు, నాయకులు ద్వారం పుల్లారెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, బొబ్బిలి నాగేశ్వరరెడ్డి, లోకేష్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శుక్రవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని చౌడేశ్వరి మాత ఫంక్షన్‌హాల్ లో వడ్లరామాపురం గ్రామానికి చెందిన నాయకుడు శేషిరెడ్డి కుమారుడి వివాహానికి హాజరయ్యారు. కృష్ణాపురం గ్రామంలో నూతన చర్చిని ప్రారంభించారు. నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలి

జూపాడుబంగ్లా: ఉపాధి హామీ పనుల్లో ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండ్లెం గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఆన్‌లైన్ మస్టర్ విధానం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పనులు చేసినా మస్టర్లలో పేర్లు రావడం లేదన్నారు.కూలీలకు గరిష్టంగా రూ.271 కూలి ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.150నుంచి రూ.180 వర్తింపజేయటం విడ్డూరంగా ఉందన్నారు. వేసవి అలవెన్సులు,మజ్జిగ అందజేయాలని కోరారు. మండల కార్యదర్శి కర్ణ, శివమణి, షాహిద్‌భాష, రవీంద్ర, నరసింహ, రంగన్న, లచ్చమ్మ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

పగిడ్యాల: మద్యానికి బానిసై విధుల నుంచి సస్పెండ్‌కు గురైన ఓ కానిస్టేబుల్ తండ్రితో కలిసి ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు అంబటి శ్రీను వివరాల మేరకు.. తాను, తన మిత్రుడు తొండ మద్దిలేటి గురువారం రాత్రి బస్టాండ్ సమీపంలో కూర్చుని మాట్లాడుకుంటుండగా.. ట్యాంక్ బడి సందులో నుంచి బయలుదేరిన కానిస్టేబుల్ అంబటి శివకృష్ణ తమ వద్దకు వద్దకు వచ్చి పరుష పదజాలంతో దూషించి దాడి చేశారని చెప్పారు. ఈ క్రమంలో స్థానికులు సర్ది చెప్పి పంపారు. అయితే సాయంత్రం బస్టాండులో కూర్చుని ఉండగా కానిస్టేబుల్, అతని తండ్రి అంబటి శేషన్న తమపై బండరాయితో దాడి చేశారని ఎస్‌ఐ నాగార్జునకు శుక్రవారం ఫిర్యాదు చేయగా.. విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చెప్పారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూతనివ్వండి

శ్రీశైలంప్రాజెక్ట్: దివ్యాంగుల చట్టాన్ని అమలు చేసి విభిన్న ప్రతిభావంతులకు చేయూతనివ్వాలని వైఎస్సార్‌సీపీ విభిన్నప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ రాజేంద్ర సింగ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి దివ్యాంగుల చట్టంపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ వైకల్య శాతంతో సంబంధం లేకుండా సామాజిక పింఛన్లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులకు అధిక పింఛన అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని చెప్పారు.

సిద్ధార్థ రెడ్డిని విమర్శించే అర్హత లేదు

కొత్తపల్లి: శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు లేదని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ (రంగ), నాగంపల్లి సొసైటీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, క్రీడాభివృద్ధికి పాటుపడుతున్న నిబద్ధత కలిగిన నాయకుడైన సిద్ధార్థరెడ్డిని విమర్శించడం టీడీపీ నాయకులకు తగదన్నారు. నియోజకవర్గం గురించి తెలుసుకోకుండా మరోసారి నోరుపారేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రానికి నారా లోకేష్ ఏమి చేశాడని యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్నాడో చెప్పాలని ప్రశ్నించారు. మీ పార్టీ హయాంలో నియోజకవర్గంలో ఎంత మేర అభివృద్ధి కార్యక్రమాలు చేశారు.. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి బహిరంగ చర్చకు వస్తే తేటతెల్లమవుతుందన్నారు.నియోజకవర్గంలో ఎస్సీలకు తమ పార్టీ సమున్నత స్థానం ఇచ్చిందని చెప్పారు. నాయకులు కొండకింది వెంకటరెడ్డి, రమేష్ బాబు, రహంతుల్లా, చంటిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యార్థులకు సత్కారం

వెలుగోడు: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘురాముడు యాదవ్, రాష్ట్ర నాయకుడు పి.నాగేషు మాట్లాడుతూ వేల్పనూరు గ్రామానికి చెందిన ఎలగాల నాగేశ్వరరావు కూతురు సాయికీర్తి 536 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. అంతకుముందు వేంపెంట రస్తాలో మహాత్మా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పదిలో 500 మార్కులకు పైగా సాధించిన సాయి కీర్తి, వెలుగోడు కు చెందిన కె.స్వామన్న కుమార్తె శివ నందినిని శాలువతో సన్మానించి, మెమెంటో అందజేశారు. ప్రత్యేక బహుమతిగా గోగుల రాము అందుకున్నారు. నాగన్న , రంగస్వామి, అంకన్న, ఎల్లయ్య పాల్గొన్నారు.



విద్యార్థినిని సత్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

'విద్యా కానుక' పకడ్బందీగా పంపిణీ చేయాలి

నంద్యాల: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్య కానుక కిట్లను పంపిణీ చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిల్లానీ శామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్పీజీ హైస్కూల్‌లోని మండల స్టాక్ పాయింట్‌ను, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెమీడియల్ తరగతులను, అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల యూనిఫాం దుస్తులను భౌతిక కొలతల ప్రకారం వచ్చాయా లేదా అని పరిశీలించారు. పాఠ్య పుస్తకాలను క్రమ పద్ధతిలో క్లాసుల వారీగా విభజించి సరఫరా చేయాలన్నారు. జూన్ 1 –12 తేదీ వరకు మండల స్టాక్ పాయింట్ల నుంచి అన్ని పాఠశాలలకు కిట్లు సరఫరా చేయాలని చెప్పారు. ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏపీఎం, నాడు–నేడు ఏఈలతో ఏర్పాటు చేసిన మండల టీం ప్రతిరోజు స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తూ కిట్లలో ఏమైనా లోపాలు ఉంటే సంబంధిత సప్లయర్‌ను సంప్రదించి రీప్లేస్ చేసుకోవాలని సూచించారు. అన్ని మండల స్టాక్ పాయింట్లు తనిఖీ చేయాలని డీఈఓ అనూరాధను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెమీడియల్ తరగతులు జరుగుతున్న కేంద్రాన్ని పరిశీలించారు. చివరగా ఆత్మకూరు బస్టాండ్ రోడ్లోని అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు.